TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 303 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.29.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## సర్కార్ బడుల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగు వేసింది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ అయిన ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని సంకల్పించింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఎంపిక చేసిన 2,769 ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వీటిని ప్రారంభించేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. క్యూర్ రీజియన్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని పట్టణ ప్రాంత పరిధిలోని 529 పాఠశాలలు ఉన్నాయి. నాన్-క్యూర్ రీజియన్ పరిధి అయిన ఇతర జిల్లాల్లోని 2,240 పాఠశాలల్లో ఈ ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. జిల్లాల వారీగా చూస్తే, హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 275 సెక్షన్లు, నల్లగొండలో 124, భద్రాద్రి కొత్తగూడెంలో 118 సెక్షన్లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

సౌకర్యాల కోసం ప్రత్యేక నిధులు

ప్రీ-ప్రైమరీ సెక్షన్లు ప్రారంభించే ప్రతి పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రూ. ఒక లక్ష చొప్పున నిధులను కేటాయించింది. ఈ నిధులతో తరగతి గదులకు చిన్నపాటి మరమ్మతులు చేయడం, చిన్న పిల్లలకు అనువైన ఫర్నిచర్ కొనుగోలు, ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువుల ఏర్పాటు చేయనున్నారు. అంతే కాకుండా, పిల్లలను ఆకట్టుకునేలా తరగతి గది గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలను పెయింటింగ్ వేయించాలని విద్యాశాఖ ఆదేశించింది. చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా శిశు-స్నేహపూర్వక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కూడా కల్పించనున్నారు.

ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకం

ఈ సెక్షన్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లను, ఆయాలను గౌరవ వేతన ప్రాతిపదికన నియమించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని కమిటీలు ఈ నియామక ప్రక్రియను చేపట్టనున్నాయి. ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ. 8 వేలు, ఆయాలకు రూ. 6 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరడానికి అర్హత ఉన్న వయస్సు గల పిల్లలందరినీ ఈ ప్రీ-ప్రైమరీ సెక్షన్లలో చేర్చుకోవచ్చు. బోధన పూర్తిగా ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రత్యేక పాఠ్యప్రణాళిక ప్రకారం సాగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి పిల్లలకు బాల్యం నుంచే నాణ్యమైన పునాది విద్య అందుతుందని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా పెరుగుతాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి:టీపీటీఎఫ్

ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగిందని టీపీటీఎఫ్ పేర్కొంది. ప్రజలు, ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు 2025-26లో 1,362 పాఠశాలల్లో ప్రారంభించారనీ, 2026-27లో 2,769 పాఠశాలల్లో ప్రారంభించడానికి ఉత్తర్వులు టీపీటీఎఫ్ అధ్యక్షులు సి.హెచ్. అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 16 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలున్నాయని వారు గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం కొన్ని పాఠశాలలకే అనుమతులిస్తే ప్రాథమిక పాఠశాలల బలోపేతం జరగదని తెలిపారు. దశల వారీగా కాకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించేలా ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పూర్వ ప్రాథమిక తరగతులను బోధించడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులను వెంటనే శాశ్వత ప్రాతిపదికన నియమించాలని వారు కోరారు.

## త్వరలోనే ఆర్టీసీ గుర్తింపు సంఘానికి ఎన్నికలు

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఆర్టీసీ గుర్తింపు సంఘానికి త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్ష?మ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికైన సంఘంతో కలిసి ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా ఈవీ బస్సులు ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత ప్రజా రవాణాను పెంపొందించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో ముందడుగు వేసిందన్నారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం కూకట్‌పల్లి డిపోకు చెందిన 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తులో హైదరాబాద్ నగరం వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుని మరో ఢిల్లీలా మారకూడదనే ఉద్దేశంతోనే పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం ఒక్క హైదరాబాద్‌లోనే 540 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1050 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయని గుర్తుచేశారు. కార్మికులకు పీఆర్సీ అమలుతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి రెండో మంగళవారం ప్రత్యేకంగా సమయం కేటాయించనున్నట్టు వివరించారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ఈవీ బస్సుల విస్తరణలో భాగంగా ప్రధాన డిపోలు, బస్టాండ్లల్లో అత్యాధునిక ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేని ప్రయాణాన్ని అందిస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన



సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే, ప్రయాణికులకు సురక్షితమైన, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయనీ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్,కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కలెక్టర్ మనుచౌదరి టికెట్ తీసుకుని నూతన బస్సుల్లో ప్రయాణించారు. వీరితోపాటు ఆర్టీసీ ఈడీ లు సిహెచ్.వెంకన్న, రాజశేఖర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీఏ కార్యాలయాల్లో అక్రమార్కుల దందా

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు హైదరాబాద్‌తో పాటు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడు ఆర్టీఏ కార్యాలయాలపై దాడులు జరిపి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించారు. ముఖ్యంగా ప్రయివేటు ఏజెంట్లు, ప్రయివేటు డ్రైవింగ్ స్కూళ్ల యాజమాన్యాలతో కుమ్మక్కై శాశ్వత లైసెన్స్‌లు, తాత్కాలిక లైసెన్స్‌ల జారీలో అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారుసిన్హా బుధవారం తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్, కొండాపూర్, నాగోల్ ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఈ మూడు ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రయివేటు ఏజెంట్లు తమ ఇష్టానుసారం తిష్ట వేసి తమకు చెందిన దరఖాస్తుదారులకు లైసెన్స్‌లను మంజూరు చేయించడంలో కీలక పాత్ర వహిస్తున్నట్టు సోదాల్లో బయటపడింది. ఒక్కో ఏజెంటు వద్ద మూడు నుంచి నాలుగు దరఖాస్తు ఫారంలు ఉండటం, వాటిని సులువుగా అధికారుల వద్దకు పంపించి, పని పూర్తయ్యేలా చేసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు.అలాగే కొందరు ఆర్టీఏ అధికారుల వద్ద కోడ్‌ల రూపంలో ఏజెంట్ల పేర్లు ఉండటం, వాటి ఆధారంగానే గుట్టు చప్పుడు కాకుండా ఏజెంట్లకు



సంబంధించిన దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు మంజూరు చేస్తూ పెద్ద మొత్తంలో లంచాలను దండుకుంటున్నట్టు కూడా తేలింది. ఈ లంచాలను కూడా మూడో కంటికి తెలియకుండా ప్రయివేటు వ్యక్తుల ద్వారా పొందుతున్నట్టు అధికారులు గుర్తించారు. అలాగే మేడ్చల్‌తో పాటు నాగోల్ డ్రైవింగ్ టెస్టుల ట్రాక్‌ల వద్ద ఏకంగా ప్రయివేటు ఏజెంట్లు, ప్రయివేటు డ్రైవింగ్ స్కూళ్ల యాజమాన్యాల ప్రతినిధులు చేరుకొని దరఖాస్తుదారులు లేకుండానే డ్రైవింగ్ టెస్టులు పూర్తయినట్టుగా సర్టిఫికెట్లు పొందడాన్ని కూడా ఏసీబీ గుర్తించింది.

## మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం





హైదరాబాద్: అమృత్ తెలంగాణ:ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని మైత్రీవనం కూడలిలో ఆయన విగ్రహాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. విగ్రహావిష్కరణకు ఎన్టీఆర్ కుమారులు మోహన్‌కృష్ణ, రామకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో దర్శకుడు బోయపాటి శ్రీను, సినీ నటుడు మంచు మనోజ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

## 2021 పేస్కేల్ సర్క్యులర్‌ను సవరించాలి

హైదరాబాద్ : ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యంతో జరిగిన చర్చల ఒప్పందంలో భాగంగా 2021 పేస్కేల్ సర్క్యులర్‌ను సవరించాలని టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష?లు వీరాంజనే యులు, ప్రధానకార్యదర్శి వివన్ రావు సంయుక్తంగా ఎండీ వై.నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో జూన్ జీతంలో అమలు చేస్తూ సర్క్యులర్ ఇచ్చినందుకు దన్యవాదాలు తెలియజేశారు. ఆ సందర్భంగా తలెత్తిన లోపాలను సవరించి కొత్తగా ఉత్తర్వులను జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ సర్క్యులర్‌ను సవరించాలని కోరుతూ ఈ లేఖ ద్వారా ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలియజేశారు. సమస్యలు..పరిష్కారాలు?1, ఆర్.పి.ఎస్-2017లో కొన్ని స్లాబ్స్ జూనియర్స్, సీనియర్స్ ఒకే స్కేలులో ఫిక్స్ చేశారనీ, వివిధ కేటగిరిల్లో 19 చోట్ల అలా జరిగిందనీ, దీనివల్ల సీనియర్స్ కు లాభం లేకుండా పోయిందని దానిని సరిచేయాలని ఇప్పటికే కోరాం. ఈ సమస్య ఆర్పిఎస్- 2021లో మరింతగా పెరిగిపోయింది. డ్రైవర్ గ్రేడ్ -- 2 క్యాడర్లోని ఆర్పిఎస్ -- 2017లోని రూ. 31,500 బేసిక్ పే, రూ. 32,270 బేసిక్ పే వున్న వారు ఇద్దరిది రూ.

42,980 వద్దే ఫిక్సేషన్ అవుతుంది. అలాగే రూ.37,840, రూ.38,640 వద్ద వున్నవారు రూ.51,510 వద్ద, రూ. 40,270, రూ.41,100, బేసిక్ పే ఉన్న వారురూ. 55,320 వద్ద, రూ.43,590, రూ.44,420 ఉన్న వారు రూ.59,400 వద్ద, రూ.47,800, రూ.48,660 బేసిక్ ఉన్న వారు రూ.64.940 వద్ద, రూ.52,100, రూ. 52,960 బేసిక్ పే వున్న వారు ఇద్దరిది రూ.70,780 వద్దనే ఫిక్స్ చేస్తారు. మొత్తం డ్రైవర్ గ్రేడ్ 2లో 22 స్లాబుల్లో ఈ పరిస్థితి వుంది.'ఇదే పరిస్థితి జూనియర్ అసిస్టెంటుతో పాటు ఇతర అన్ని క్యాటగిరీలలోనూ వుంది. ఈ పే ఎనామలీస్ ను సరి చేసి స్కేల్స్ చేయాలని మేము కోరినప్పటికీ ఆ సమస్య మరింత తీవ్రమయ్యేలా చేయడం బాధాకరం. దానిని సరి చేయాలని' కోరుతున్నాము.2. ఇంక్రిమెంటు రేట్ : ఇంక్రిమెట్లు రేట్లు అన్ని స్థాయిల్లో ఐదు శాతం వుండాలని




కోరగా పాత పద్ధతిలోనే, అంటే పర్సంటేజ్లో చూసినప్పుడు 3.12 శాతం నుంచి 3.82 శాతం వుండగా చివరి స్లాబులు 1.95 శాతం నుంచి 2.05 శాతం మాత్రమే వున్నాయి. కనీసం అన్ని స్థాయిల్లోను ప్రారంభంలో వున్న రేట్లతోనే చివరి వరకు ఉండేలా చూడగలరని కోరుతున్నాము.3. డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాపిక్) కంటే టిఐ-3/డిసి/టిటిఐ/డిఐ లు కింది స్థాయిలో వుంటారు.

కానీ టిఐ3 క్యాడర్లో రూ. 62690 స్కేలు వద్ద ఇంక్రిమెంటు రేటు రూ.1550 లుగా వుండగా డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) స్కేలు రూ. 60,510 నుండి రూ.69,510 మధ్య ఇంక్రిమెంటు రేట్ రూ.1500 లు వుండటంతో ఒకే స్థాయి జీతంలో కూడా డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) రూ.50 తక్కువగా ఇంక్రిమెంటు పొందుతున్నారు. దీనిని సరి చేయాలి.4. స్కేల్స్ లో ఇంక్రిమెంటు స్పాన్ 8 సంవత్సరాల స్థానంలో మూడేండ్లు వుండాలని కోరగా కేవలం ఆరేండ్లుగా మాత్రమే నిర్ణయించారు. దీనిని ఆర్టీసీ ఒప్పందాల కాలం అయిన నాలుగేండ్లుగా మార్చాలని కోరుతున్నాము.5. సిసిఏ అమలు : సిటీ కంపెన్సటరీ అలవెన్స్ (సిసిఏ) ప్రభుత్వ విధానమే అమలు చేస్తారు. కాబట్టి ఇక్కడ పాత సిసిఏ రేట్లనే కొనసాగిస్తున్నారని భావిస్తున్నాము. అయితే 2021-2026 మధ్యలో అనేక మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయ్యాఇ. అందుకని అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ కార్పొరేషన్లల్లో సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్ ను అమలు చేసేలా చూడాలని కోరుతున్నాం,6. ఇంటి అద్దె అలవెన్స్ : ఇటీవలి కాలంలో మున్సిపాల్టీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయిన నగరాలలోని డిపో కార్మికులకు ఇంటి అద్దె అలవెన్స్లు సరి చేయాలని కోరుతున్నాం.7. టైపిస్టులకు స్పెషల్ పే : ప్రస్తుతం మన సంస్థలో టైపిస్టులు అతి తక్కువగానే వున్నారు. స్పెషల్ పే ని స్కేల్లో మెర్జ్ చేయాలన్న చిరకాల కోర్కె అలాగే మిగిలిపోయింది. అందుకని వారి స్పెషల్ పే ని బేసిక్ పేలో కలిపేలా నిర్ణయం చేయాల్సిందిగా కోరుతున్నాం. 8. గ్రేడ్ పే : ఆర్పిఎస్-2021 నుంచి 2026 జూన్ నెల జీతంలో అమలు చేస్తున్నారు.

ఆర్పిఎస్-2025 ఇంకా బాకీ వున్నది. అలాగే ప్రభుత్వం అంగీకరించినట్టు ఆర్టీసి కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా విలీనం చేసే క్రమంలో ఆర్టీసి కార్మికులకు అమలులో వున్న గ్రేడ్ పేలను కొనసాగించకపోవచ్చు.కానీ ఆర్పిఎస్ -- 2021లోనే గ్రేడ్ పేలను బేసిక్పే లో మెర్జ్ చేస్తూ సూచిక -3లోని సర్క్యులర్ ఇచ్చారు. దీనివల్ల డిప్యూటీ సూపరిటెండెంట్ నుంచి పై క్యాడర్లో వున్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. విలీన ప్రక్రియ జరిగే వరకు 'గ్రేడ్ పే' లను యధావిధంగా కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నాము.9. ఆర్పిఎస్ -- 2017, ఆర్పిఎస్ 2021 పరిధిలో రిటైరైన వారి చెల్లింపులు.ఆర్పిఎస్ -- 2017 , ఆర్పిఎస్ -2021ల ఒప్పందం అమలు కాలంలో రిటైరైన ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలపై ఎటువంటి స్పష్టత సూచిక-3లోని సర్క్యులర్ లో లేదు. దీనిపై వెంటనే స్పష్టత ఇవ్వాలి.10. స్టాగ్నేషన్ ప్రమోషన్స్ స్థానంలో ఆటోమెటిక్ అడ్వాన్స్మెంటు స్కీంను అమలు చేయడం : ప్రస్తుతం ఆర్టీసిలో 12 నుంచి 20 సంవత్సరాలలో స్టాగ్నేషన్ స్కేల్లు అమలు చేస్తున్నారు. ఆ స్థానంలో 6-12-18-24-30 సంIIల ఆటోమేటిక్ అడ్వాన్స్మెంటు (ఏఏఎస్) ను అమలు చేయాలని కోరుతున్నాం.11. అలవెన్స్ లు : 21.05.2026న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమిటీ కీ కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగిన చర్చలలో అంగీకరించినట్టు ఎస్ -- 2013లోని అలవెన్స్ లు అన్నింటిని 80 శాతం పెంచుతూ తక్షణమే ఉత్తర్వులు ఇచ్చి, కార్మికులు ఇంకా నష్టపోకుండా చూడాలని కోరుతున్నాం.

# ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

## రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





### అర్లి కే శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్లును పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా,

నిర్మల్ జిల్లా మే 28 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును, నిల్వల పరిస్థితిని, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, ఇంకా ఎంత కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల సామర్థ్యం, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వాహనాలు నిలిచిపోకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. అలాగే మిల్లుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేసి గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గడువులోగా నిల్వలను గోదాములకు తరలించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం మెట్రిక్ టన్నుల వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పెంచికల్‌పాడు గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం ఉందని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ తెలియజేయడంతో అక్కడ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, కుంటాల తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ,సర్పంచ్లు చెంద్యాల మురళి, దశరత్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్లీ కల్లూరు కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

# ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు : జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ త్యాగానికి, భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులందరికీ జిల్లా కలెక్టర్ రాజర్షి షా హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దైవప్రేమ, త్యాగనిరతి, కరుణ, మానవతా విలువలను చాటిచెప్పే గొప్ప పండుగ బక్రీద్ అని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఈ పండుగ ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ, జగమంతా శాంతి, కరుణ, సోదరభావంతో నిండిపోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు.

# ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇటీవల జరిగిన ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంఘం ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఓం ప్రకాష్ రెడ్డి ని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఓం ప్రకాష్ రెడ్డి ని శ్రీకాంత్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో రెడ్డి సంఘం అభివృద్ధికి మరియు సంక్షేమానికి ఆయన నాయకత్వంలో మరింత కృషి జరగాలని ఆకాంక్షించారు. వారివెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బాల్యం నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బాల్యం నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు, రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక చావర అకాడమీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన "ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్"ను సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న విద్యార్థులు గత రెండు రోజులుగా సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ విద్యాధర రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతా నియమాలను అలవరుచుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాధాన్యత, జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం వంటి ప్రాథమిక అంశాలను విద్యార్థులు ప్రాక్టికల్‌గా తెలుసుకునేందుకు ఈ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.

విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఉష్కం తిరుపతి మాట్లాడుతూ, పుస్తక పరమైన జ్ఞానంతో పాటు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందిస్తాయని అన్నారు.

సమ్మర్ క్యాంప్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్శన కార్యక్రమంలో చావర అకాడమీ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, రవాణా శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈద్గాల వద్ద బందోబస్తు పరిశీలించిన ఎస్పీ అశోక్ కుమార్



కోరుట్ల అమృత్ తెలంగాణ మే 28: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముస్లిం సోదర, సోదరీమణులకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కోరుట్లలోని ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ నిచ్చిన: సుప్రియ



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 28: జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన 25 ఏళ్ల సుప్రియ, మూడు రోజుల క్రితం నర్సింగాపూర్ బైపాస్ రోడ్డులో స్కూటీ నేర్చుకుంటుండగా ప్రమాదానికి గురైంది. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. భర్త ప్రవీణ్, కుటుంబసభ్యుల అంగీకారంతో సుప్రియ గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్ళు వంటి అవయవాలను దానం చేశారు. ఈ అవయవదానం ద్వారా ఆరుగురికి పునర్జన్మ లభించింది.

# ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం : రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద




అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 28, 2026: ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.హొహొగురువారం జిల్లాలోని చెన్నూర్ మండలంహొహొబావురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 2022-23 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జూన్ 6వ తేదీ వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక లారీలనుహొహొధాన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తిహొహొచేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూర్ నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూర్, కోటపల్లిహొహొమండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

## మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించాం

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి



ధర్మపురి అమృత్ తెలంగాణ మే 28: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఈద్గా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ. 7కోట్లు కేటాయించినట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# రైతుల సౌకర్యార్థం రెండు కొత్త టోకెన్ కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి దృశ్యం




రైతులకు టోకెన్లపై సంతకం పెడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మార్కెట్ కు వచ్చే రైతులకు టోకెన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈరోజు రెండు నూతన టోకెన్ సెంటర్లు ప్రారంభించారు. ఈ కొత్త కేంద్రాల ఏర్పాటు వల్ల టోకెన్ల పంపిణీ ప్రక్రియ యథావిధిగా, సజావుగా కొనసాగింది. రద్దీ కారణంగా మార్కెట్ కు వచ్చిన రైతులు ఎవరూ నిరాశగా వెనుతిరగకుండా, అందరూ సులభంగా టోకెన్లు తీసుకుని వెళ్లారు. రైతుల శ్రేయస్సు కోసం సకాలంలో స్పందించి అదనపు టోకెన్ కేంద్రాలను ఏర్పాటు చేసిన చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి చర్య పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జన్మదిన సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి ఇచ్చిన గ్రామ సర్పంచ్ అశోక్



మొక్కను నాటుతున్న దృశ్యం

అమృత్ తెలంగాణ తాంసి న్యూస్ పుట్టినరోజు జరుపుకుంటున్న నా ఆత్మీయ మిత్రుడు మునేశ్వర్ సృజయ్ రెండు పండ్ల మొక్కలు నాటడం జరిగింది..జామిడి గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం చేయడమే నాదేమని తెలిపారు సందర్భంగా గ్రామంలో రెండు పండ్ల మొక్కలు నాటాలన్న పిలుపు మేరకు పర్యావరణాన్ని కాపడుతూ గ్రామాన్ని పచ్చదనం చేయడంలో భాగమైన సృజయ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు తదితరులు పాల్గొన్నారు

# బోథ్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ బక్రీద్ శుభాకాంక్షలు



ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ త్యాగానికి, లౌకికత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను నియోజకవర్గ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు తన హృదయపూర్వక బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు బక్రీద్ పండుగ దైవప్రవక్త ఇబ్రహీం చూపిన అసమాన త్యాగనిరతిని, దైవభక్తిని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుందని ఆడే గజేందర్ పేర్కొన్నారు. స్వార్థాన్ని వీడి, తోటి మానవుల పట్ల కరుణ, దయ కలిగి ఉండటమే ఈ పండుగ ఇచ్చే గొప్ప సందేశమని ఆయన అన్నారు. ఈ పవిత్ర పర్వదినాన నియోజకవర్గంలో హిందూ, ముస్లిం సోదరులంతా కలిసిమెలిసి పండుగను జరుపుకోవడం మన సంస్కృతికి అద్దం పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మతం ఏదైనా, మనం పీల్చే గాలి, తాగే నీరు ఒక్కటేనని, తరతరాలుగా వస్తున్న గంగా-జమునా తెహజీబ్, మతసామరస్యం, సంప్రదాయాన్ని మనమంతా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఒకరి పండుగల్లో మరొకరు భాగస్వామ్యులవుతూ, కష్టసుఖాలను పంచుకుంటూ, సోదరభావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో నిజమైన శాంతి వర్ధిల్లుతుందని ఆడే గజేందర్ స్పష్టం చేశారు. ఈ బక్రీద్ ప్రతి ఇంట్లో ఆనందాన్ని, నియోజకవర్గంలో శాంతిసౌఖ్యాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# అంతర్రాష్ట్ర భారీ వాహనాల దొంగల ముఠా అరెస్ట్

**పదిమందిపై కేసు, ముగ్గురు నిందితులు అరెస్ట్**

**తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో భారీ వాహనాల చోరీలకు పాల్పడిన ముఠా**

**ఒక్కరోజులో భారీ వాహనాన్ని సైతం విడిభాగాలుగా విడగొట్టి మాయం చేస్తున్న కేటుగాళ్లు**

**దొంగతనాలకు ఉపయోగించిన టయోటా ఎటియోస్ కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం**

**సిసిటివి కెమెరాల ప్రాధాన్యత పై వివరణ : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ హైవేలపై నిర్మానుష్య ప్రదేశాలలో పార్క్ చేసిన భారీ వాణిజ్య వాహనాలను లక్ష్యంగా చేసుకొని అంతర్రాష్ట్ర స్థాయిలో చోరీలకు పాల్పడుతున్న ఒక భారీ వాహనాల దొంగల ముఠాను మావల పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు ఏఆర్ హెడ్క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.

నిందితుల వివరాలు:

1. సలీం, తండ్రి సెహిద్, వయస్సు 36 సంవత్సరాలు, ట్రక్ డ్రైవర్, పల్వాల్ జిల్లా, హర్యానా రాష్ట్రం.
2. నఫీస్ ఖాన్, తండ్రి ఝుద్మాల్, వయస్సు 37 సంవత్సరాలు, ట్రక్ డ్రైవర్, మేవాత్ జిల్లా, హర్యానా రాష్ట్రం.
3. ఇంతాజ్ హుస్సేన్ ఏ ఇంతియాజ్, తండ్రి ఖుర్షీద్, వయస్సు 28 సంవత్సరాలు, మెకానిక్, భరత్పూర్ జిల్లా, రాజస్థాన్ రాష్ట్రం.

తో పాటుగా మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేర పద్ధతి:

ఈ ముఠా తెల్లటి టయోటా ఎటియోస్ కారులో వివిధ రాష్ట్రాల్లో సంచరిస్తూ, హైవేలు మరియు పెట్రోల్ బంకుల వద్ద పార్క్ చేసిన భారీ వాహనాలను గుర్తించి వాటి తలుపుల గ్లాస్ పగులగొట్టి, స్టీరింగ్ లాక్ విరగదీసి, ఇగ్నిషన్ వైరింగ్ కట్ చేసి వాహనాలను దొంగిలించేవారని తెలిపారు. ఈ ముఠా ఐషర్, టిప్పర్ వంటి భారీ వాహనాలను దొంగిలించి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు తరలించి విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. దొంగిలించిన వాహనాలను ఈ రాష్ట్రాలకు తరలించి వాహనాన్ని ఒక్కరోజులో పూర్తిగా విడిభాగాలుగా విడగొట్టి ఒక్కొక్క భాగాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లుగా వివరించారు.

వీరిపై గతంలో నమోదైన కేసులు:

మావల పోలీస్ స్టేషన్ Cr.No.325/2026

గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ Cr.No.113/2026

శంషాబాద్ పోలీస్ స్టేషన్ Cr.No .90/2026

గత రాత్రి మావల బైపాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు ప్రయాణిస్తున్న టయోటా ఎటియోస్ కారును పోలీసులు అనుమానంతో ఆపగా పరారయ్యేందుకు ప్రయత్నించారు. వెంటనే వెంబడించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి టయోటా ఎటియోస్ కారు 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన సైబర్ సెల్, సాంకేతిక బృందం, ఆదిలాబాద్ రూరల్, మావల పోలీస్ స్టేషన్, సిసిఎస్, సిబ్బంది మరియు మధ్యప్రదేశ్ పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, మావల సిఐ బి డి ప్రేమ్ కుమార్, డబ్ల్యూ పిఎస్ ఇన్స్పెక్టర్ కె ఫణిదర్, రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్,ఎస్ఐ శ్రీకాంత్, ఐటి కోర్ ఆర్ఎస్ఐ గోపి కృష్ణ,1 టౌన్ పీసీ నరేష్, సైబర్ సెల్ పీసీ త్రిశూల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విల్లేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి

**నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**




అమృత్ తెలంగాణ నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులు, క్రైమ్ ప్రాపర్టీలు, సీజ్ చేసిన వాహనాలు, సీసీ కెమెరా పనితీరు, కోర్టు సంబంధిత రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విల్లేజ్ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ కావాలని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గ్రామ స్థాయి సమాచార వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. దొంగతనాలు, చోరీలు, ఇతర ఆస్తి నేరాల నివారణకు రాత్రి, పగలు పటిష్ట గస్తీ నిర్వహించాలని, ముఖ్యంగా హైవేలు, గ్రామ శివార్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులను తరచుగా తనిఖీ చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్పి వెంట నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, ఎస్బి సీఐ ఆది రెడ్డి, 2టౌన్ సీఐ రాఘవ రావు, రూరల్ ఎస్.ఐ సైదా బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 28, 2026: ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలుయిఅయబస్త్ర చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ ఒ బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము కేటాయించడం జరిగిందని, ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిప్పుతో భూసారానికి ముప్పు

**మిత్రజీవుల మనుగడకు ప్రమాదం : పంటలపై ప్రభావం**



అమృత్ తెలంగాణ రైతులు పొలంలో ఉన్న వరి కుదు ళ్లకు నిప్పు పెడుతుంటారు. ఈ కుదుళ్లు ఉంటే తిరిగి పంటవేసుకునే సమయంలో దున్నేందుకు. దుక్కికి అడ్డంకిగా ఉంటుందని పూర్తిగా కాల్చేస్తు న్నారు. ఇలా చేస్తే రైతుకే నష్టం జరుగుతుంది. నిప్పు పెడితే భూమి తన సారాన్ని కోల్పోతుంది. అలాగే ఉంచి దున్నిస్తే మంచి సారం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. భూమిలో మెగ్నీషియం, కాల్షియం. సూక్ష్మజీవులు వృ ద్ధితోపాటు నత్రజని పెరుగుతుంది. తద్వారా చౌడును తగ్గించి తర్వాత పంటకు ఉపయోగపడు తుందని సూచిస్తున్నారు. తిరిగి పంట వేసుకునే టప్పుడు వేర్లు భూమిలోకి వెళ్లడానికి కూడా అవకాశం ఉంటుందని, ఫలితంగా మొక్క బాగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొంటున్నారు. ఆదే నిప్పు పెట్టి కాల్చివేస్తే నేల సారవంతం కావడానికి, మొక్క ఎదుగుదలకు ఉపయోగపడే మేలు రకాలన్నీ నాశనం అవుతాయి. అలాగే పంటకు మేలు చేసే ఎర్రలు కూడా పూర్తిగా చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల భవిష్యత్లో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. భూమిని దున్నే సమయంలో రైతులకు కొద్ది కష్టంగా ఉంటుంది.

కాని దీని వల్ల భూమిలో సారం పెరగడంతోపాటు దిగు బడులు పెరిగి అంతిమంగా మేలు చేకూరుతుంది. దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది వంట వ్యర్థాలకు నిప్పు పెట్టడం సరైన విధానం కాదు. దీని వల్ల మిత్రజీవులు పూర్తిగా నశించిపోతాయి. తర్వాతి సీజన్ లో సాగుచేసే పంటల్లో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. తడి పిన తరువాత దున్నితే నేలకు పోషకాహారాలుగా ఉపయోగపడుతాయి.

# ప్రశాంతంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు

## స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలోని నిర్మల్, భైంసా పట్టణాలలో బక్రీద్ పండుగ ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ స్వయంగా ప్రార్థనా స్థలాలను సందర్శిస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మల్ పట్టణంలో ప్రార్థనలు ముగిసిన అనంతరం జిల్లా ఎస్పీ చిన్నారులని, ముస్లిం సోదరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారితో ఆప్యాయంగా మాట్లాడి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ ( అడ్మిన్) ఉపేందర్ రెడ్డి,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, రవీందర్ నాయక్,గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, అజయ్,కిరణ్ ఆర్.ఐ లు రామ్ నిరంజన్ రావ్, శేఖర్ ఎస్ఐ లు, ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

# కేరళ మాజీ సీఎం ఇంటిపై ఈడీ దాడులను ఖండించిన బూరుగు కృష్ణారెడ్డి




అమృత్ తెలంగాణ కేరళ మాజీ ముఖ్యమంత్రి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన దాడులను సీపీఐ(ఎం) పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు చౌటుప్పల్ సీపీఎం మండల, మున్సిపల్ కమిటీల ఆధ్వర్యంలో గురువారం హైవే రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన పినరయి విజయన్‌కు సొంత ఇల్లు కూడా లేదు. పదవి విరమణ అనంతరం కిరాయి ఇంట్లో ఉంటున్న ఆయనపై ఈడీ దాడులు చేయడం విడ్డూరం అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై నేరుగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను, ప్రశ్నించే మీడియాను సహించలేని స్థితిలో బీజేపీ ప్రభుత్వం ఉంది. ప్రశ్నించే వ్యక్తులనే టార్గెట్ చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కారు దుర్వినియోగం చేస్తోంది అని ఆరోపించారు.వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారితో పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులది. ఈడీ దాడులకు భయపడి మేము ప్రశ్నించే హక్కును కోల్పోము" అని కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, చీర్క సంజీవరెడ్డి, ఆకుల ధర్మయ్య,బోయ యాదయ్య, అంతటి అశోక్, తూర్పునూరు మల్లేష్, చికురు ఈదయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బావుండ్లపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, యాట బాలరాజు, తిగుళ్ల యాదమ్మ, తిగుళ్ల శంకరయ్య, బాలగోని బాలరాజు, మోగుదాల రాములు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజల వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్




అమృత్ తెలంగాణ రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు పై ఏర్పాటు చేసిన సమావేశానికి రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ఈ సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి ఈ పర్యటనలు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, ఎలాంటి ఆర్థిక పరిస్థితులు ఎదురైనా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు అస్సలు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.రైతులకు నష్టం జరగనివ్వమని మంత్రి తెలిపారు.రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. నాలుగు, ఐదు రోజులు పాటు ఇసుక వాహనాలను పంట కొనుగోలు కోసం, అన్లోడింగ్ కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు. యాసంగి పంట రికార్డ్ స్థాయిలో వచ్చిందని ,వరి ధాన్యం, జాగ్రత్తలు పాటిస్తూ ధాన్యమును గోడౌన్లకు తరలించాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ సారి వరి ధాన్యం అద్భుతమైన పంటలు పండాయని, రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయటం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. మద్దతు ధర ప్రకటించిన ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తూ అత్యధిక మొత్తంలో డబ్బులు జమ చేయడం జరిగిందని అన్నారు. తడచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈసారి వరి ధాన్యం ఎక్కువ దిగుబడి వచ్చిందని, రైతుల పక్షాన ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,75,686. 220 మెట్రిక్ టన్నులధాన్యంకొనుగోలుచేయడం జరిగింది. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకఎలాంటిఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడంజరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలోరెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి,శేఖర్‌రెడ్డి,జిల్లా గ్రామీణాభివృద్ధిఅధికారి నాగిరెడ్డి,జిల్లా సివిల్‌సప్లై మేనేజర్ హరికృష్ణ జిల్లా పౌర సరఫరాలఅధికారి రోజా రాణి, జిల్లావ్యవసాయఅధికారి రమణారెడ్డి ,మండలతాసిల్దార్లు,యంపిఓలు ,సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్దాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# రవితేజ.. పర్ఫెక్ట్ పండగ ప్లాన్



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల వరుస అపజయాలతో వెనుకబడ్డ రవితేజ, తన తదుపరి సినిమాలకు చాలా జాగ్రత్తగా స్క్రిప్టులు ఎంపిక చేసుకుంటున్నాడు. మాస్ జాతర అనే హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే, తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతోంది. రవితేజ కూడా వెంకటేష్ తరహాలో టార్గెట్ సెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల వెంకటేష్ – అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వెంకీ కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమా సక్సెస్ కావడానికి కాంబినేషన్ ఒక కారణమైతే రిలీజ్ స్లాట్ మరో ముఖ్యమైన రీజన్. ఇక రవితేజ కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలోకి దిగబోతున్నాడట. సాధారణంగా సంక్రాంతి టాలీవుడ్‌కు బిగ్గెస్ట్ సీజన్. ప్రతి పెద్ద హీరో తన సినిమాను ఈ పండగ సీజన్‌లో రిలీజ్ చేయాలని చూస్తాడు.

ఇప్పటివరకు ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్, చిరంజీవి–అనిల్ రావిపూడి ప్రాజెక్ట్‌లు ఈ ఫెస్టివల్ సీజన్ కోసం లైన్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఈ పోటీకి మాస్ మహారాజా కూడా జాయిన్ అవుతుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. సంక్రాంతి సక్సెస్ రేషియోలో ఉన్న అనిల్ ఈసారి చిరంజీవితో వస్తున్నారు కాబట్టి ఆ సినిమాకు పోటీగా నిలవడం అంత ఈజీ కాదు. అయితే రవితేజ కూడా ఓ ప్లానింగ్ తోనే వస్తున్నాడు. తన కొత్త సినిమాను క్లాస్ మేకర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేయబోతున్నాడనే న్యూస్ కన్ఫర్మ్ అయింది. కిషోర్ తిరుమల సినిమాలకు యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంటుంది.

నేను శైలజ, చిత్ర లహరి వంటి ప్రాజెక్ట్స్‌తో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు, రవితేజతో కలిసి ఏ తరహా కథను తీసుకురాబోతున్నాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు రవితేజ మాస్ యాక్షన్ పాత్రలలోనే ఎక్కువ కనిపించాడు. అయితే, ఈసారి మాత్రం ఫ్యామిలీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఉండేలా స్క్రిప్ట్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. దీంతో ఇది సంక్రాంతికి పర్ఫెక్ట్ సినిమా అవుతుందనే ఆలోచనలో ఉన్నారట.

వెంకటేష్ తరహాలోనే మాస్ రాజా కూడా సంక్రాంతి టైమ్ లో సీజన్ కు తగ్గ కాంటెంట్ తో హిట్టు కొట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నాడు. గతంలో దసరా, రామారావు ఆన్ డ్యూటీ లాంటి సినిమాలను నిర్మించిన ఈ నిర్మాత ఇప్పుడు రవితేజ – కిషోర్ ప్రాజెక్టును కూడా గ్రాండ్ గా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. మాస్, క్లాస్ మిక్స్‌గా రూపొందనున్న ఈ సినిమా, సంక్రాంతి రిలీజ్ కోసం ముందుగానే ప్లాన్ చేయబడింది.

# ఎప్పుడు ఏ వైపు నుంచి ఫోటో తీస్తారో తెలీదు!


ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. బాడీ ఇమేజ్‌తో తన కష్టాల గురించి ఎప్పుడూ ఓపెన్‌గా చెప్పే నటి సోనాక్షి సిన్హా, తన అధిక బరువు గురించి ఎప్పుడూ ఓపెన్ గా మాట్లాడుతుంది. ప్లస్ సైజ్ తనకు ఎప్పుడూ అడ్డంకి కాదని ధైర్యంగా చెబుతుంది. ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె శరీర తత్వం, దాంతో పాటే వచ్చిన ఇమేజ్‌ని మేనేజ్ చేయాల్సిన అవసరం గురించి మాట్లాడింది. దీని కారణంగా పబ్లిక్ లో గోప్యత విషయమై గందరగోళం నెలకొంటుందని, భారతదేశంలో ఈ విషయంపై జాగ్రత్త వహించాలని సోనాక్షి అంది. అలాగే తాను భారతదేశంలో స్విమ్మింగ్‌ను ఎందుకు ఇష్టపడను?అనే విషయాన్ని కూడా మాట్లాడింది. ఈత దుస్తులను ధరించేటప్పుడు.. ముఖ్యంగా పెరిగే వయసులో నేను ఎల్లప్పుడూ స్పృహతో ఉన్నాను. నేను ముంబయిలో లేదా ఈ దేశంలో ఈత కొట్టను.ఎందుకంటే ఎవరైనా రహస్యంగా ఫోటో తీసి ఎప్పుడు ఎక్కడికి పంపుతారో నాకుతెలియదు. ఇది ఇంటర్నెట్‌లో షికార్ చేయడం నాకు ఇష్టం లేదు. నేను భారతదేశం వదిలి



ఎక్కడికైనా వెళ్లినప్పుడుఈతకొడతాను.అనిస్పష్టంగా చెప్పింది. సినిమాఈ భయంవెనక ఏదోఒకకారణం ఉంటుంది.అలాగే నన్ను బరువుతగ్గాలనిఅమ్మఎప్పుడూ చెబుతూ ఉండేదని, కానీదానికి విరుద్ధంగా చేయడానికి ఇష్టపడేదానిని అని కూడా సోనాక్షి తన మొండితనం గురించి చెప్పింది.చిన్న పిల్లలుగా మనస్తత్వాలు అలా ఉంటాయి. కానీ మా అమ్మ నాకు చెప్పడం మానేసిన రోజునే నా బరువు గురించి నేను ఏదైనా చేయాల్సిన అవసరం ఉందని నాకు అనిపించిందని తెలిపింది.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య–బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com